క్లుప్తంగా

సబ్ కలెక్టర్‌ను కలిసిన డీఎల్‌పీవో



బోధన్: డివిజనల్ పంచాయతీ అధికారి ఎస్.నాగరాజు మంగళవారం పట్టణంలో సబ్ కలెక్టర్ వికాస్ మహతోను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఆయన బాన్సువాడ నుంచి బోధన్‌కు బదిలీపై వచ్చారు.

బర్డ్స్ వాటర్ ఫీడర్స్ తయారు చేసిన విద్యార్థులు



బాల్కొండ: పశువుల దాహార్తిని తీర్చుట కోసం ముప్కాల్ మండలం రెంజర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు బర్డ్స్ వాటర్ ఫీడర్స్‌ను తయారు చేశారు.నిరుపయోగంగా ఉన్న స్టీల్ ప్లేట్స్ మరియు జీఏ వైరుతో ఫీడర్స్ తయారు చేసి చెట్లకు కట్టారు. విద్యార్థుల కృషిని మంగళవారం ఎంఈవో రవికుమార్ అభినందించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

జీఎస్టీపై విద్యార్థులకు వర్క్‌షాప్

ఆర్మూర్ టౌన్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం వాణిజ్యశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జీఎస్టీ అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా టీయూ కామర్స్ హెడ్ ప్రొఫెసర్ రాంబాబు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. 2017లో వన్ నేషన్ వన్ టాక్స్ గా జీఎస్టీని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. ఈవర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్‌లను అందజేశారు. కార్యాక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వేణు ప్రసాద్, వర్క్‌షాప్ కో ఆర్డినేటర్ లింగన్న, కన్వీనర్ అజయ్‌కుమార్, టీయూ అధ్యాపకులు శ్రీనివాస్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలకు పెద్దపీట



కమ్మర్‌పల్లి: మహిళా సంఘాల సభ్యుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తోందని ఐకేపీ ఏపీఎం కుంట గంగాధర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో మాట్లాడారు. అనంతరం మహిళలకు క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు రోజా రాణి, సీసీలు వర్దం శ్రీనివాస్, నవీన్ కుమార్, భాగ్యలక్ష్మి, పీరియ, అలేఖ్య తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు చెక్కుల అందజేత



వర్ని : ఉమ్మడి వర్ని మండలంలోని చందూర్, కోటగిరి, వర్ని మండలాలకు చెందిన 82 మంది లబ్ధిదారులకు మంగళవారం బాన్సువాడలో ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. వర్ని మండలంలో 19, చందూరులో 07, కోటగిరిలో 56 మంది లబ్ధిదారులకు సంబంధించిన చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు.

ప్రమాదమని తెలిసినా..



బాల్కొండ: మహారాష్ట్ర నుంచి వచ్చిన వలస కూలీలు మక్కల నూర్పిడీ యంత్రంపై ప్రమాదకరంగా ప్రయాణం చేస్తున్నారు. ముప్కాల్ మండలం రెంజల్ గ్రామశివారులో మంగళవారం ఈదృశ్యాన్ని సాక్షి క్లిక్ మనిపించింది.

వేధింపులు ఆపాలి

వర్ని: గ్రామపంచాయతీ కార్మికులపై అధికారుల వేధింపులు మానుకోవాలని సీఐటీయూ మండల అధ్యక్షులు సాయిలు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారుల వేధింపులు మానుకోకపోతే కార్మికులతో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. వేసవికాలం ప్రారంభమైనందున పని వేళలు మార్చాలని, పని ప్రదేశంలో తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు. నాయకులు సాయి చరణ్, నాగయ్య, గంగారాం, భూమయ్య పాల్గొన్నారు.

మిషన్ భగీరథలో అందని వేతనాలు

- ఆరు నెలలుగా జీతాలు రాని పరిస్థితి
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆపరేటర్లు
- గ్రిడ్ వద్ద ధర్నా



మిషన్ భగీరథ గ్రిడ్ వద్ద ధర్నా చేస్తున్న ఆపరేటర్లు

బాల్కొండ : బాల్కొండ మండలం జలాల్‌పూర్ శివారులోని మిషన్ భగీరథ వాటర్ గ్రిడ్, గ్రిడ్ నుంచి నీటిని పైప్‌లైన్లకు సరఫరా చేసే ఆపరేటర్లు, ఎలక్ట్రీషియన్లకు గత ఆరు నెలలుగా వేతనాలు అందడం లేదు. దీంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మూడు ఏజెన్సీల ద్వారా పల్లెలకు మిషన్ భగీరథ నీటిసరఫరాను చేపడుతున్నారు. ఈఏజెన్సీలు సుమారు 100 మంది ఉద్యోగులను నియమించుకున్నాయి. జలాల్‌పూర్ గ్రిడ్ లోనే 30 మంది ఆపరేటర్లు పని చేస్తున్నారు. ఏజెన్సీలకు ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో వారు సిబ్బందికి జీతాలు అందించడంలేదు. దీంతో మిషన్ భగీరథ ఆపరేటర్లు మంగళవారం వెంటనే వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ జలాల్‌పూర్ శివారులో మిషన్ భగీరథ గ్రిడ్ వద్ద ధర్నా నిర్వహించారు. ఉన్నతాధికారులు స్పందించి వేతనాలు అందించకుంటే నిరవధిక సమ్మెకు చేస్తామని ఆపరేటర్లు హెచ్చరించారు.

ఉద్యోగ భద్రత లేక..

మిషన్ భగీరథలో పని చేస్తున్నా ఆపరేటర్లు, లైన్‌మెన్‌లు, ఎలక్ట్రీషియన్లకు ఉద్యోగ భద్రత లేకపోవడంతో వేతనాల కోసం నిలదీయలేని దుస్థితి. అధికారులు మరుసటి రోజు వేధింపులకు గురిచేస్తారని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



మిషన్ భగీరథ జలాల్‌పూర్ గ్రిడ్‌లో పనిచేస్తున్నా. గత ఆరు నెలలుగా జీతాలు రావడం లేదు. దీంతో కుటుంబ పోషణకు ఇబ్బందులు పడుతున్నాం. ప్రతి ఏడాది ఇలానే జరుగుతుంది. – శ్రీకాంత్, ఆపరేటర్

పట్టించుకోవడం లేదు



వేతనాల కోసం ఎంత అడిగినా పట్టించుకోవడం లేదు. ఆరు నెలలుగా వేతనాలు రాకుంటే కుటుంబం ఎలా గడుస్తుంది. ఎక్కడ ఉద్యోగం లభించక వేతనాలు ఇవ్వకున్నా ఇక్కడే పనిచేస్తున్నాం. ప్రభుత్వం మా ఇబ్బందులను పట్టించుకోవాలి. – రోహిత్, ఆపరేటర్

హోలీ వరకు అందిస్తాం

గత ఐదు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదు. హోలీ వరకు వేతనాలు చెల్లిస్తామని ఏజెన్సీలు చెప్పాయి. జిల్లా వ్యాప్తంగా ఇలాంటి సమస్యలున్నాయి. తాగు నీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. – అబ్దుల్ సమీర్, ఏఈ, మిషన్ భగీరథ, బాల్కొండ

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం



మాక్లూర్ లో అభివృద్ధి పనుల ప్రొసిడింగ్‌లను అందజేస్తున్న వినయ్‌రెడ్డి

నందిపేట్/మాక్లూర్/పెర్కిట్(ఆర్మూర్): కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి అన్నారు. నందిపేటలో, మాక్లూర్, ఆలూరు మండలాల కేంద్రాల్లో వివిధ గ్రామాలకు సంబంధించి పలు అభివృద్ధి పనులకు మంజూరైన ప్రొసెడింగ్ కాపీలను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకుందామన్నారు. కార్యక్రమంలో నందిపేట పార్టీ మండలాధ్యక్షుడు మంద మహిపాల్, ఆలూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముక్కెర విజయ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గురుకులాన్ని తనిఖీ చేసిన అసిస్టెంట్ కలెక్టర్

డొంకేశ్వర్(ఆర్మూర్): మండలంలోని నూత్‌పల్లి బీసీ గురుకుల బాలుర పాఠశాలను అసిస్టెంట్ (ట్రైనీ) కలెక్టర్ సాకేత్ కుమార్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టోర్ రూమ్, వంట గదిని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సౌకర్యాలు ఎలా ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారితో కలిసి భోజనం చేశారు. ఎంపీడీవో శ్రీనివాస్ రావు, జీపీ కార్యదర్శి మోహన్ ఉన్నారు.



చెరువులో వాటా కోసం రాస్తారోకో



చందూర్‌లో రాస్తారోకో చేస్తున్న లక్ష్మాపూర్ గ్రామస్తులు

వర్ని(చందూర్): చందూరు మండలం లక్ష్మాపూర్ గ్రామానికి లక్ష్మీ సాగర్ ప్రాజెక్టులో చేపల వాటా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మంగళవారం గ్రామస్తులు మండల కేంద్రంలో రాస్తారోకో నిర్వహించారు. లక్ష్మీ సాగర్ ప్రాజెక్టులో లక్ష్మాపూర్ గ్రామానికి 60 శాతం వాటా ఉన్నప్పటికీ మేడిపల్లి గ్రామస్తులు అన్యాయంగా వాటాను ఇవ్వడం లేదని ఆరోపించారు. బోధన్ ఏసీపీ శ్రీనివాస్, మత్స్యశాఖ ఏడీ అంజనేయులు ఆందోళన కారులను సముదాయించి రాస్తారోకో విరమింప చేశారు. ఇరు గ్రామాల పెద్దలతో పోలీసులు, మత్స్యశాఖ అధికారులు సమావేశం నిర్వహించి సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

బుద్దె రాజేశ్వర్ సేవలు చిరస్మరణీయం



నివాళులు అర్పిస్తున్న నాయకులు, అభిమానులు

బోధన్: సాలూర గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు బుద్దె రాజేశ్వర్ సేవలు చిరస్మరణీయమని పలు పార్టీల నేతలు అన్నారు. మంగళవారం సాలూరలో పార్టీలకతీతంగా గ్రామస్తులు, నాయకులు ఆయన జయంతిని నిర్వహించారు. రాజేశ్వర్ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. స్థానిక జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లను పంపిణీ చేశారు. రాజేశ్వర్ సతీమణి సావిత్రి, డీసీసీబీ డైరెక్టర్ గిర్దావర్ గంగారెడ్డి, పీఆర్‌టీయూ జిల్లా మాజీ అధ్యక్షుడు ఇల్తెపు శంకర్, సొసైటీ చైర్మన్ అల్లె జనార్దన్, బీఎస్పీ జిల్లా అధ్యక్షు డు పాండు, బీఆర్ఎస్ నాయకులు నర్సయ్య, స్వామిగౌడ్, అల్లె రమేష్, డిస్కో సాయిలు, ప్రకాష్, ఆయా గ్రామాల నాయకులు, పాల్గొన్నారు.

రంజాన్ మాస ఉపవాస దీక్షల నేపథ్యంలో మంగళవారం సాయంత్రం సాలూర మండల కేంద్రంలో బోధన్ తాజా మాజీ ఎంపీపీ బుద్దె సావిత్రి రాజేశ్వర్ స్వగృహంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. సీనియర్ నాయకుడు రాజేశ్వర్ జయంతిని పురస్కరించుకుని ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశామని కుటుంబీకులు తెలిపారు. ఈ విందులో ముస్లింలు, గ్రామ ప్రజాప్రతినిధులు, నాయకులు, రాజేశ్వర్ అభిమానులు పాల్గొన్నారు.

టీచర్ల హక్కుల సాధనకు పీఆర్టీయూ కృషి



కోటగిరిలో పీఆర్టీయూ ఆధ్వర్యంలో మహిళ టీచర్లను సన్మానిస్తున్న నాయకులు

రుద్రూర్/వేల్పూర్/నవీపేట : కోటగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం పీఆర్టీయూ మండలశాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా మండలంలోని మహిళ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు పి.మోహన్ రెడ్డి మాట్లాడుతూ... మహిళ టీచర్ల సమస్యల పరిష్కారం, టీచర్ల హక్కుల సాధనలో పీఆర్టీయూ కృషి ఎంతో ఉందన్నారు.వేల్పూర్ మండలం అంక్సాపూర్ హైస్కూలులో స్వర్గీయ మాదరి అన్నపూర్ణ స్మారక ట్రస్టు ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లను, ఆశావర్కర్లను, మధ్యాహ్న భోజనం వండే మహిళలను సన్మానించారు. నవీపేట రైతు వేదికలో విద్యాశాఖ ఆధ్వర్యంలో వివిధ గ్రామాలకు చెందిన మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. ఈకార్యక్రమంలో ఎంఈవోలు శ్రీనివాస్ రావ్, అశోక్, హెచ్ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

సమాచారం

■ నేడు మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతరాయం

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్‌లో బుధవారం మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని మున్సిపల్ కమిషనర్ రాజు మంగళవారం తెలిపారు. పెర్కిట్ 44వ జాతీయ రహదారి పక్కన పట్టణానికి నీటిని సరఫరా చేసే మిషన్ భగీరథ పైపు మరమ్మతులకు గురైనట్లు తెలిపారు.

■ నేడు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జంబిహనుమాన్ ఆవరణలో గల టౌన్ ఏఈ కార్యాలయంలో బుధవారం విద్యుత్ వినియోగదారులు ఫిర్యాదు పరిష్కార వేదిక ఏర్పాటు చేస్తున్నట్లు ఏడీఈ కృష్ణ మంగళవారం తెలిపారు. ఆర్మూర్ టౌన్-1,2, దేగాం-5 పరిధిలోని వినియోదదారులు తమ విద్యుత్ సంబంధిత సమస్యలను ఉదయం పదిన్నర గంటల నుంచి విన్నవించుకోవచ్చని పేర్కొన్నారు.

అధ్యాత్మికం

■ వైభవంగా శ్రీ విఠలేశ్వర స్వామి వార్షికోత్సవం



రుద్రూర్ : మండల కేంద్రంలోని శ్రీరుక్మిణి సహిత విఠలేశ్వర స్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు శ్రీరుక్మిణి పాండురంగ కల్యాణం, హోమం నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈఆలయ వార్షికోత్సవ కార్యక్రమానికి శ్రీశ్రీశ్రీ బసవలింగ అవదూత మహరాజ్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం భక్తులకు ప్రవచనం ఇచ్చారు. ప్రతి ఒక్కరూ దైవభక్తిని అలవర్చుకోవాలని సూచించారు. భగవన్నామస్మారణచేస్తే ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ పూజారి రామ శర్మ, ఆలయ కమిటీ అధ్యక్షులు చిదుర వీరేశం, గెంటీల సాయిలు, నారాయణ, లలేందర్, కర్క అశోక్, కొలస్ గంగాధర్, ఆలయ కమిటీ సభ్యులు, హనుమాన్ స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

■ భక్తిశ్రద్ధలతో శ్రీ లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం

వేల్పూర్: మండలంలోని పడగల్ గ్రామంలో మంగళవారం గంగపుత్రసంఘం ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీనర్సింహస్వామి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. వేదపండితులు రఘురామాచార్యులు, రాజగోపాలాచార్యులు, ప్రణవ్‌చార్యుల ఆధ్వర్యంలో అభిషేకం, ఎదుర్కోలు, గ్రామ వీధులలో రథోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో గంగపుత్ర సంఘం సభ్యులు రాజగంగారాం, బలరాం, గంగా మోహన్,మల్లయ్య, శంకర్, చిన్నరాజన్న పాల్గొన్నారు.

■ ఘనంగా ఆలయ శిఖర ప్రతిష్ఠాపన మహోత్సవం



రుద్రూర్: మండలంలోని అంబం (ఆర్) గ్రామంలో శ్రీ ఆంజనేయ స్వామి ఆలయ శిఖర ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. హంపీ పీఠాధిపతి శ్రీ విరూపాక్ష విద్యారణ్య స్వామి ఆధ్వర్యంలో మహయజ్ఞం, ఆలయ శిఖర ప్రతిష్ఠాపన జరిగింది. కార్యక్రమంలో ఆలయ, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

■ నేడు రుద్రూర్‌లో యజ్ఞ సహిత కామ దహనం

రుద్రూర్: మండల కేంద్రంలో బుధవారం రాత్రి కామదహనం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు గ్రామ గోశాల, యోగ కేంద్రం సభ్యులు తెలిపారు. రాత్రి నిర్వహించే కామదహన కార్యక్రమానికి మల్లారం పిట్ల కృష్ణ మహరాజ్ ముఖ్య అతిథిగా రానున్నారని పేర్కొన్నారు. కామ దహనంలో వేయడానికి ఆవు పిడకలు, గోమయ సమిధలు గోశాల వద్ద లభిస్తాయని తెలిపారు.

బాడీ ఫ్రీజర్ వితరణ



వేల్పూర్: మండలంలోని జాన్కంపేట్ వీడీసీకి డెడ్ బాడీ ఫ్రీజర్‌ను గ్రామస్తుడు జేమ్స్ గంగారెడ్డి తన తండ్రి గాదెపల్లి మల్లేష్, మామ పోచంపల్లి రాజన్న స్మారకార్థం మంగళవారం వితరణ చేశారు. రూ. 60 వేలు వెచ్చించి బాడీ ఫ్రీజర్‌ను అందించిన గంగారెడ్డిని గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో భీమ్‌గల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రంగు అనిల్‌గౌడ్, మాజీ సర్పంచ్ సొడ రమేశ్, మాజీ ఎంపీటీసీలు గాదెపల్లి సత్యంరెడ్డి, సొడ చందన్, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పోటీలు



బోధన్: విద్యార్థుల్లో అంతర్లీనంగా ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు, ప్రతిభాపాటవ పోటీలు నిర్వహించినట్టు సాలూర మండల విద్యాధికారిణి రాజీ మంజూష తెలిపారు. మంగళవారం సాలూర మండల స్థాయి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్రతిభోత్సవం పేరుతో వివిధ అంశాలపై ప్రతిభ పోటీలు నిర్వహించారు. చిత్రలేఖనం, కథలు చెప్పటం, చదవడం, గణిత శాస్త్ర సంబంధిత నైపుణ్యాలపై పోటీలు నిర్వహించి విజేత విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించిన విద్యార్థులు



ఎడపల్లి(బోధన్): సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల పోచంపాడు విద్యార్థులు మంగళవారం జైతాపూర్ గ్రామంలోని కరటూరి పాపారావు వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు. విద్యార్థులకు పాపారావు సంప్రదాయ పంటల పద్ధతులు ప్రకృతి వ్యవసాయం గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రశాంతి, టీచర్లు, 147 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

- స్క్రీన్-1: రాక్షస(తెలుగు)-1.45; సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు (తెలుగు)-4.20. 10.10; నారి(ది ఉమెన్)(తెలుగు)-7.35
- స్క్రీన్-2: సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు(తెలుగు)-10.15. సివంగి(తెలుగు)-1.30. రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్(తెలుగు)-4.10. 7.20. 10.30
- స్క్రీన్-3-: ఛావా(తెలుగు)-10.00. 4.20. కింగ్స్టన్(తెలుగు)-1.20.7.40. 10.40
- స్క్రీన్-4: ఛావా(తెలుగు)-12.20. 7.00. ఛావా(హిందీ)-3.40. 10.20

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

- స్క్రీన్-1: ఛావా(తెలుగు)- 11.00.4.40.10.30; ఛావా(హిందీ) - 1.45. 7.40
- స్క్రీన్-2: సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు (తెలుగు) -1.30. 7.30; నారి (తెలుగు) -4.40; రా.. రాజా(తెలుగు) -10.30
- స్క్రీన్-3: జిగేల్(తెలుగు) - 11.00; కింగ్స్టన్(తెలుగు)- 1.30. 7.30; రిటర్న్ ఆఫ్ డ్రాగన్(తెలుగు) -4.40. 10.20

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

- స్క్రీన్-1: ఛావా(తెలుగు)-10.00; కింగ్స్టన్(తెలుగు)-1.20. 7.40; రిటర్న్ ఆఫ్‌ది డ్రాగన్(తెలుగు)-4.20. 10.40
- స్క్రీన్-2: సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు (తెలుగు)-10.15; ఛావా(హిందీ)-1.30. 10.50; సివంగి(తెలుగు)-4.50; ఛావా(తెలుగు)-7.30
- స్క్రీన్-3: రిటర్న్ ఆఫ్‌ది డ్రాగన్(తెలుగు)-10.25; ఛావా(తెలుగు)-1.35; మిక్కీ-17(ఇంగ్లీష్)-4.55. 7.50; కింగ్స్టన్(తెలుగు)-10.45
- స్క్రీన్ -4: నారి(తెలుగు)-10.35; మిక్కీ-17(ఇంగ్లీష్)-1.10. జాబిలమ్మ నీకు అంత కోపమా (తెలుగు)-1.30; సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు (తెలుగు)-4.05. 10.30; రిటర్న్ ఆఫ్‌ది డ్రాగన్(తెలుగు)-7.20

లలితామహల్	సీతమ్మవాకిట్లో సిరిమల్లె చెట్టు
దేవి	మజాకా(తెలుగు)
నటరాజ్	రిటర్న్ ఆఫ్‌ది డ్రాగన్
విజయ్	ఛావా (తెలుగు)

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	140
		లైవ్	90
స్కిన్‌లెస్	160	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	88,300	వెండి(కిలో)	1,01,000
22 క్యారెట్స్	81,492		

– నిజామాబాద్ బిజినెస్

సంక్షిప్తం

ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు సరికావు



బోధన్‌టౌన్(బోధన్): నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు సరికావని డీసీసీ గెలిగెట్ గంగాశంకర్ అన్నారు. మంగళవారం బోధన్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్వింద్ జిల్లాలో చేసిన అభివృద్ధి ఏంటని, ఎన్నికలకు ముందు బోధన్‌లో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం కోసం శంకుస్థాపన చేసి మరిచి పోయారన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు పాషా మొయినొద్దీన్, మండల అధ్యక్షులు నాగేశ్వర్‌రావు, శివాలయం చైర్మన్ హరికాంత్ చారీ, నాయకులు దాము, రాములు తదితరులు ఉన్నారు.

మెరుగైన విద్యుత్ సరఫరాకు చర్యలు

రుద్రూర్ : రుద్రూర్ మండలంలోని రాయకూర్ గ్రామంలో మెరుగైన విద్యుత్ సరఫరాకు గాను అధికారులు మంగళవారం 25 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ను ఏర్పాటు చేశారు. మండల ట్రాన్స్‌కో అసిస్టెంట్ ఇంజినీర్ శ్రీనివాస్, లైన్ ఇన్స్పెక్టర్ రాజేశం, లైన్‌మన్ సబీల్, తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్, ప్రింటర్ వితరణ

బాల్కొండ: మెండోరా మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయానికి వ్యాపారవేత్త ఏనుగు దయానంద్ రెడ్డి కంప్యూటర్, ప్రింటర్‌ను అందించారు. మంగళవారం వాటిని కార్యాలయంలో ఎంఈవో శ్రీనివాస్ ప్రారంభించారు.

విద్యార్థులకు పరీక్ష అట్టల..

కమ్మర్‌పల్లి/నందిపేట్ : విద్యార్థులకు పరీక్ష అట్టలను, మెటీరియల్‌ను వితరణ చేశారు. మండలం హసకొత్తూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు మంగళవారం స్థానిక దాత అడ్వకేట్ మోహన్‌నాయక్ పరీక్ష అట్టలను వితరణ చేశారు. నందిపేట జెడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతి విద్యార్థులకు 1989-90 సంవత్సరం పూర్వ విద్యార్థులు పరీక్షకు కావాల్సిన మెటీరియల్‌ను అందజేశారు.

శంభాజీ మహరాజ్‌కు ఘన నివాళి

పోతంగల్ (రుద్రూర్): పోతంగల్‌మండలం హంగర్గా అబాది శివాజీ చౌక్ వద్ద, రుద్రూర్‌లోని శివాజీ చౌక్ వద్ద శివాజీ యూత్ సభ్యుల ఆధ్వర్యంలో శంభాజీ మహరాజ్ వర్ధంతిని నిర్వహించారు. శంభాజీ చిత్రపటానికి నివాళులు అర్పించారు. యూత్ సభ్యులు, యువకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడాదుస్తుల అందజేత

మాక్లూర్ : మండలంలోని బోర్గాం(కె) గ్రామానికి చెందిన డాక్టర్ మట్ట చరణ్ మాణిక్‌భండార్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మంగళవారం క్రీడా దుస్తులను అంజేశారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కంటి అద్దాల పంపిణీ

పెర్కిట్(ఆర్మూర్)/నవీపేట: పెర్కిట్ తెలుగు మీడియం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం ఆర్‌బీఎస్‌కే వైద్య బృందం వైద్యురాలు రుబీనా షాహిన్ కంటి అద్దాలను పంపిణీ చేశారు. నవీపేట బాలికల విద్యాలయంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు కంటి అద్దాలను పంపిణీ చేశారు.

క్యాంపస్ సెలెక్షన్స్‌లో విద్యార్థుల ఎంపిక

మాక్లూర్ : మండలంలోని వీఆర్ఈసీ కళాశాలలో మంగళవారం జరిగిన క్యాంపస్ సెలెక్షన్స్‌లో కళాశాలకు చెందిన 6 మంది విద్యార్థులు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ గణేశ్ తెలిపారు. ప్రముఖ కంపెనీ ఎక్స్‌సెల్లర్ ప్రతినిధులు శిల్ప, అవినాష్‌లు బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్న 60 మంది విద్యార్థుల్లో ఆరుగురు విద్యార్థులను ఎంపికచేసుకున్నట్టు తెలిపారు.

కొనసాగుతున్న నిరసన దీక్షలు

రెంజల్/ఆర్మూర్‌టౌన్ : ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్షలు కొనసాగుతున్నాయి. రెంజల్‌లోని ఎంపీడీవో కార్యాలయం, ఆర్మూర్ తహసీల్దార్ కార్యాలయం ముందు చేపట్టిన నిరవధిక నిరసన దీక్షలు మంగళవారం రెండవ రోజుకు చేరుకున్నాయి. ఎస్సీ వర్గీకరణ చట్టం వచ్చేంత వరకు ప్రభుత్వ ఉద్యోగ నియామకాలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.